క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గుర్ల: మండలంలోని గవిడిపేటలో అభయాంజనేయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఆలయ ధర్మకర్త కర్రోతు శరత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు చేశారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం జరిపించారు. సుమారు మూడు వేల మంది భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు.

వైభవంగా శివాలయం వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు, పెద్దలు

వేపాడ: మండలంలో బానాది శివాలయం తృతీయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు మేడపాటి కిషోర్‌శర్మ మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామ పూజలు, రుద్రాభిషేకం, ప్రత్యేక హోమం చేపట్టారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకులకు శిక్షణ



శిక్షణలో సూచనలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ బాలభాస్కరరావు నేతృత్వంలో నిర్వహించిన శిక్షణలో పరిసరాల పరిశుభ్రత, మెనూ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్పీలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై నారాయణరావు

గుర్ల: పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వార్తా పత్రికలు, పుస్తకాలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రామారావు, గుర్ల గ్రామ ఉపాధ్యాయులు రాలి శ్రీనివాసరావు, మజ్జి త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

గుర్ల (గరివిడి): గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గరివిడి శాఖా గ్రంథాలయాధికారి ఎం. ఉషారాణి సూచించారు. గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి శుక్రవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు గుప్తా, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం..

వేపాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా లైబ్రేరియన్ చంద్రశేఖర్ వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

దత్తిరాజేరు: మండలంలోని శికారుగంజి మోడల్ పాఠశాలలో మిగులు సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ ప్రసన్నలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 10 నుంచి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75.. బీసీ విద్యార్థులు రూ. 150 చెల్లించాలన్నారు.

గాలి వీస్తే కరెంట్ కట్..

- చిరుగాలులకు సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయం
- గజపతినగరంలో పెరిగిన అప్రకటిత కోతలు
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



సబ్‌స్టేషన్, గజపతినగరం

గజపతినగరం రూరల్: చిన్నపాటి గాలి వీచినా, చినుకులు పడినా గజపతినగరం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. మళ్లీ సరఫరా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నగరంలో అప్రకటిత కోతలు పెరిగిపోయాయయంటూ వినియోగదారులు మండిపడుతున్నారు. నగరంలో విద్యుత్ సరఫరా మెరుగుకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు గొప్పలు చెప్పడమే తప్ప.. ఆ దిశగా అడుగులు వేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయని వినియోగదారులను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల నుంచి ముక్కుపిండి మరీ బిల్లులు వసూలు చేస్తున్న అధికారులు సరఫరా మాత్రం సక్రమంగా ఇవ్వలేకపోతున్నారనే అపప్రథను మూటగట్టుకున్నారు.

ఎప్పటికప్పుడు కోతలు..

విద్యుత్ అధికారులు నెలలో కనీసం రెండు సార్లైనా మెయింటినెన్స్ పేరుతో గంటల తరబడి సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో పాటు గాలి వీచినా, వర్షం కురిసినా సరఫరా ఆపేస్తూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో రోజుకు కనీసం నాలుగైదు గంటలు సరఫరా ఉండడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పగటిపూట పరిస్థితి ఒకలా ఉంటే.. సాయంత్రమైతే చాలు చిన్న వర్షం పడినా కరెంట్ పోతోంది. మళ్లీ ఏ అర్ధరాత్రి సరఫరా ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి అప్రకటిత కోతలు ఆపి మెరుగైన సరఫరా ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



ఏమాత్రం గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. దీనివల్ల వ్యాపారస్తులతో పాటు స్థానికులు కూడా ఇబ్బందికి గురవుతున్నారు. ఒక్కోసారి గాలి లేకున్నా చిన్నపాటి వర్షం పడినా సరఫరా ఉండడం లేదు. అధికారులు అప్రకటిత కోతలు నిలిపివేయాలి.

– గంగరాజ్, వ్యాపారి, గజపతినగరం

కోతలు అధికమయ్యాయి..



ఇటీవల విద్యుత్ కోతలు అధికమయ్యాయి. చిన్నపాటి గాలి వీస్తే విద్యుత్‌ను నిలిపేస్తున్నారు. మళ్లీ ఎప్పుడు సరఫరా ఇస్తారో తెలియడం లేదు. బిల్లులు చెల్లిస్తున్న వినియోగదారులకు నాణ్యమైన సరఫరా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

–రామకృష్ణ, స్థానికుడు, గజపతినగరం

విద్యుత్ కోతలు సహజం..

గాలి, వాన వచ్చినప్పుడు విద్యుత్ కోతలు సహజం. సరఫరా నిలిపివేయకపోతే ఫీడర్లు పాడయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం అయితే అప్రకటిత కోతలు లేవు. వాతావరణ సమస్యల వల్ల మాత్రమే ముందస్తు జాగ్రత్తతో సరఫరా నిలిపివేస్తున్నాం. ఇబ్బంది కలగనియ్యం.విద్యుత్ సమస్యలు ఎప్పుడు వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చును.

– పి. రాజు , ఏఈ గజపతినగరం

ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

గంట్యాడ: విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కోరారు. మండలంలోని కొర్లాం గ్రామానికి వచ్చిన ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాలకు సరిపడా ఉపాధ్యాయులను నియమించినప్పుడే విద్యారంగం బలోపేతం అవుతుందన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యాకిట్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జ్ బంకపల్లి శివప్రసాద్, మోహన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు విద్యార్థులు



గవిడి ఆదిత్య వర్ధన్



కనుమూరు ప్రదీప్



పాండ్రంకి జగన్



కంది లిఖిత స్వరాజ్



జెస్సీ

చీపురుపల్లి: నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించేందుకు నిర్వహించిన పరీక్షల్లో నలుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన గవిడి ఆదిత్య వర్ధన్, కనుమూరు ప్రదీప్, పాండ్రంకి జగన్‌తో పాటు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన కంది లిఖిత స్వరాజ్ అర్హత సాధించింది. ఈ మేరకు విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కొట్యాడ విద్యార్థి ఎంపిక..

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని తలారి జెస్సీ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఈ మేరకు విద్యార్థినిని హెచ్‌ఎం జామి అప్పలనాయుడు, తదితరులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

వేసవి విజ్ఞాన తరగతులతో విద్యార్థులకు మేలు

- ఎంఈఓ –2 ధర్మశ్రీను



మాట్లాడుతున్న ఎంఈఓ - 2 ధర్మశ్రీను

మెరకముడిదాం: వేసవి విజ్ఞాన తరగతులతో విద్యార్థులకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రంథాలయాల్లో తరగతులు నిర్వహిస్తోందని ఎంఈఓ –2 ధర్మశ్రీను అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి విజ్ఞాన తరగతులు ముగిసినప్పటికీ విద్యార్థులు ఖాళీ సమయంలో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవాలని సూచించారు. లైబ్రేరియన్ ఎ.బుచ్చింనాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు ఎంతో ఉపయోగపడతాని చెప్పారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెరకముడిదాం జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పులకించిన పుణ్య తిరుమల గిరి

- పండగ వాతావరణంలో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం
- వేల సంఖ్యలో హాజరైన భక్తులు



ఆలయంలో ప్రతిష్ఠించిన పద్మావతి, వేంకటేశ్వర స్వామి, గోదాదేవి మూర్తులు



అనుగ్రహ భాషణం చేస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ అహోబిల జియర్‌స్వామి

శృంగవరపుకోట : పట్టణానికి పశ్చిమాన ఉన్న పుణ్య తిరుమలగిరి క్షేత్రంలో పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు సహా మరికొందరు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీమాన్ మంగళగిరి యాదగిరి జియర్ స్వామి నేతృత్వంలో రుత్వికులు బాలభోగం, శాంతిపాఠం, మూలమంత్ర, మూర్తిమంత్ర హవనాదులు చేసి మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పూర్ణ కలశాలతో హోమశాల నుంచి ప్రధానాలయానికి వెళ్లి పద్మావతి, గోదాదేవి, వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ, విష్వక్సేన విగ్రహాలు, కలశాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అహోబిలం జియర్ స్వామి పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ.. మహాక్రతువుకు అన్ని విధాలా సహకారం అందించిన మిత్రులు, పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.



మంత్రి శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

వీఐపీల రాక..

ఆలయ ప్రారంభోత్సవానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య, శోభా హైమావతిలు హాజరయ్యారు. ఎస్.కోట ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు ఆటపాటలు, వ్యాయామంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ..కిశోర బాలికలు అన్ని రకాల విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ పి.కృష్ణచైతన్య, తరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

వేపాడ: మండల కేంద్రానికి చెందిన గ్రామ పురోహితుడు గోపాజోస్యుల జానకిరామయ్య (గోపి పంతులు) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న 'మన వేపాడ – మన నేస్తం' స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు 10,500 రూపాయలు సేకరించి శుక్రవారం అందజేశారు.

రామాలయానికి శంకుస్థాపన ..



శంకుస్థాపన పూజ చేస్తున్న సర్పంచ్ జమ్ము పార్వతి, దంపతులు

గుర్ల: మండలంలోని తెట్టంగిలో రామాలయ నిర్మాణానికి సర్పంచ్ జమ్ము పార్వతి, వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జమ్ము రమాదేవి, జమ్ము లచ్చన్న దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనారాయణమూర్తి ఆలయ వార్షికోత్సవం



సూర్యనారాయణమూర్తిస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న వేద పండితులు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురంలో సూర్యనారాయణ మూర్తిస్వామి ఆలయ 39వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్‌వీ రమణరాజు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు ఆరవెల్లి కృష్ణశాస్త్రి, తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి క్షీరాభిషేకం, నారికేళ అభిషేకం చేపట్టారు. అదేవిధంగా స్వామివారికి పట్టువస్త్రాలతో అలంకరిచారు. వేడుకల్లో సోమలింగాపురం గ్రామానికి చెందిన భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

వితరణ



చీపురుపల్లి మండలంలోని పుర్రేయవలస గ్రామంలో శివాలయానికి నిర్మాణానికి సంబంధించి పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కల్లేపల్లి ఈశ్వరరావు 20 బస్తాల సిమెంట్‌ను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను కమిటీ సభ్యులు అభినందించారు.

సందర్శన..



చీపురుపల్లి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో గల బీసీ సంక్షేమ సమీకృత బాలుర వసతిగృహాన్ని ఫస్ట్‌క్లాస్ స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్, చీపురుపల్లి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ (ఎఫ్ఏసీ) పొన్నూరు బుజ్జి శుక్రవారం సందర్శించారు. వసతిగృహంలో ఎంత మంది విద్యార్థులుంటారు.. ఎలాంటి సౌకర్యాలున్నాయి.. భోజనం మెనూపై ఆరా తీశారు. అనంతరం వసతిగృహంలో టాయిలెట్స్, తాగునీరు వంటి సదుపాయాలు ఉన్నాయో, లేవో పరిశీలించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

– చీపురుపల్లి

అక్షరాభ్యాసం..



బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామంలో గల రాజరాజేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం సామూహిక అక్షరాభాస్యాలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు దూసి శ్రీధర్ శర్మ పిల్లలతో సరస్వతీదేవి పూజ చేయించిన తర్వాత అక్షరాభాస్యం చేశారు.

– బొండపల్లి

విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు..



లక్కవరపుకోట మండలంలోని కొట్యాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శనివారం కూడా ఉత్సవాలు నిర్వహిస్తామని సర్పంచ్ కొట్యాడ దేవీమహేష్ తెలిపారు. అహోబిలం త్రిదండి రామానుజ జియర్‌స్వామి చేతులమీదగా కార్యక్రమం ప్రారంభమైంది.

– లక్కవరపుకోట

చినరాజేరులో తాగునీటి ఇక్కట్లు..



దత్తిరాజేరు పంచాయతీ మధుర గ్రామమైన చినరాజేరులో దాహం కేకలు వినిపిస్తున్నాయి. కుళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో గ్రామానికి ఎంతో దూరంలో ఉన్న కోనేటి నీరును తెచ్చుకుంటున్నారు. కోనేటి నీటి వల్ల ఎటువంటి వ్యాధులు సోకుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తాగునీటి సరఫరా ఏఈ కార్తీక్ వద్ద ప్రస్తావించగా.. పైప్‌లైన్ పాడైందని, శనివారం సాయంత్రానికి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.

– దత్తిరాజేరు

పాడవుతున్నా పట్టించుకోరా..!





పాడైన వాహనాలు

కొత్తవలస: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు పూర్తిగా పాడవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పలు కేసుల్లో పట్టుబడిన వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు మండల కేంద్రంలో గల పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. అయితే ఇవి పూర్తిగా తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతున్నాయి. ఏ కేసులో ఏ బండి సీజ్ చేశారో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఇటువంటి వాహనాలను వేలంలో విక్రయించేవారు. దీనివల్ల ప్రభుత్వానికి కొంత ఆదాయం వచ్చేది. అయితే ప్రస్తుత అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. కళ్లముందే వాహనాలు పాడవుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

లక్కవరపుకోట : మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు (గ్రీన్ అంబాసిడర్లు) ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రతి నెలా 5వ తేదీలోగా జీతాలు అందించాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, ప్రతీ కార్మికుడుకి గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఈఓ అప్పారావుకు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయుకులు తరిణి వెంకటరమణ, గాడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.